https://teluguislam.net



అనుబంధం

# సమాధి జీవితం ఎలా ఉంటుంది?

సమాధి జీవితం ఎలా ఉంటుంది? ఈ ప్రశ్నకు సంక్షిప్తంగా, సూటిగా సమాధానం చెప్పాలంటే "అల్లాహు వ రసూలుహూ అలమ్", అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకు బాగా తెలుసు అనాలి. ఎందుకంటే దేన్నయితే మనం ఎన్నడూ చూడలేదో లేక దేని అనుభవమయితే మనకు అస్సలు ఎదురుకాలేదో దానిగురించి ఏదో ఒక మాట నమ్మకంగా చెప్పటం అసాధ్యం. అయినా కూడా ప్రభృతులు కొందరు సమాధి జీవితం గురించి దైవగ్రంథం, దైవప్రవక్త విధానంతో ఏ మాత్రం పొసగని మాటలు మాట్లాడుతుంటారు. ఉదా:

1) ఔలియాలు తమ సమాధుల్లో శాశ్వత జీవితంతో సజీవంగా ఉన్నారు. వారికి జ్ఞానం, గ్రహణం, వినటం, చూడటం మొదలగు శక్తులు మునుపటికన్నా బాగా ఉన్నాయి (1)
2) షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రజి) అనునిత్యం చూస్తూ, ప్రతి ఒక్కరి మొరలు ఆలకిస్తూ ఉంటారు. (2)
3) మృతులు వింటారు. మరణానంతరం తమ అభిమానులకు సహాయం చేస్తారు. (3)
4) దేవుని ప్రియదాసులు సమాధిలోనూ వింటారు కనుక యాఅలీ, యాగౌస్ అని పిలవవచ్చు. (4)
5) ఔలియాలు నిర్యాణం తర్వాత కూడా సజీవంగానే ఉంటారు. వారి పనులు, మహిమలు, వారి అనుగ్రహాలు యథాతథంగా కొనసాగుతూ ఉంటాయి. మనలాంటి బానిసలు, నౌకర్లు, అభిమానులకు వారి సహాయసహకారాలు ఎల్లప్పుడూ తోడుంటాయి. (5)
6) దేవుని వలీలు చావరు. నిజానికి వారు ఒక ఇంటినుంచి మరో ఇంటికి మారుతారు. వారి ఆత్మలు కేవలం ఒక రోజు మాత్రమే దేహాన్ని విడిచిపెట్టి ఉంటాయి. ఆ తర్వాత శరీరంలోకి వెళ్ళి యథాప్రకారం ఉంటాయి. (6)
7) వలీల ఆత్మబలం నుంచి ప్రయోజనం పొందటం, వారి హృదయాల ద్వారా,

---

1) అమ్‌జద్‌అలీ బహారె షరీఅత్ 58వ పుట. 2) ముఫ్తీ అబ్దుల్ ఖాదిర్, ఇజాలతుజ్జలాలహ్ 7వ పుట. 3) మౌలానా అహ్మద్ యార్ ఇల్ముల్ ఖుర్‌అన్ 189 పుట (4) నూరుల్లాహ్ ఖాద్రీ ఫతావా రజ్‌వియ్యా 537వ పుట. 5) అహ్మద్ యార్ ఖాన్ బరేల్వీ ఫతావా రజ్‌వియా 4వ సంపుటి 23వ పుట.6) ఫతావా నయీమియా, ఇఖ్తిదార్ బిన్ అహ్మద్‌యార్ బరేల్వీ. 225వ పుట.

https://teluguislam.net



సమాధుల ద్వారా ఆంతరంగిక అనుగ్రహాలు కలగటం నిజమే. అందులో సందేహం లేదు. [1]

8) హాజి ఇమ్‌దాదుల్లాహ్ ముహాజిర్ మక్కీగారు తమ ఆధ్యాత్మిక గురువు మియా హాజి నూర్ ముహమ్మద్ చనిపోయినప్పుడు ఆయన దగ్గరే ఉన్నారు. ఆయన ఇలా చెబుతున్నారు: "పరలోక ప్రయాణానికి సందేశం వచ్చింది" అన్న మాట గురువుగారి నోటవినగానే నేను ఆయన మంచంకోడు పట్టుకొని ఏడ్వసాగాను. అప్పుడు ఆయన నన్ను ఓదారుస్తూ "ఈ ఫకీరు చావడు. ఒకచోటు నుంచి మరో చోటుకి వెళ్తాడు అంతే. మామూలు జీవితంలో నా ద్వారా ఏ ప్రయోజనాలు అయితే కలుగుతున్నాయో (మరణానంతరం) నా సమాధి ద్వారా కూడా మీకు ఆ ప్రయోజనాలు కలుగుతాయి. [2]

9) హజ్రత్ (మౌలానా అహ్మద్ యార్) రహ్మలై ఈ ప్రపంచం నుంచి కనుమరుగై పోయారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. కాని గుర్తుంచుకోండి. ఆ మహానుభావుడు నఖ్‌షబందియా, అవేసియా పరంపరల స్థాపకుడు. ఇప్పుడూ ఉన్నారు. ఇకమీద కూడా ఉంటారు. అవేసియాతో సంబంధం కలిగి ఉండటమంటే ఒక ఆత్మ నుంచి మరో ఆత్మ ప్రయోజనం పొందటమే. ఇహలోకంలోనయినా, సమాధి జీవితంలోనయినా ఆత్మ నుంచి ప్రయోజనం పొందటం రెండు పరిస్థితుల్లోనూ సమానమే. కాకపోతే పై రెండిటి మధ్య కాస్త వ్యత్యాసముంది. అదేమిటంటే ఇహలోకంలో ప్రతి వ్యక్తి ఆయనగారి మహోన్నత సన్నిధికి హాజరవగలడు. అదే సమాధి జీవితంలోనయితే అక్కడి వరకు చేర్చగలిగే మనిషి అవసరం ఏర్పడుతుంది. వారి సేవకుడు, ప్రతినిధి మాత్రమే ఆ పని చేయగలడు. అనుగ్రహం మాత్రం, సమాధిలోవుండే వలీదే అయి ఉంటుంది కాని ఆ అనుగ్రహ పంపిణీ ఒక 'ఉనికి' ద్వారా జరుగుతుంది. ఆ 'ఉనికి'నే ఖలీఫా అని అంటారు. [3]

10) హజ్రత్ జి (రహ్మలై) (అల్లాహ్‌యార్ ఖాన్)గారి నిర్యాణం జరిగింది. ఆయన పవిత్ర భౌతిక కాయం తన కుటీరంలో విశ్రాంతి తీసుకుంటోంది. పవిత్రాత్మ అత్యున్నత ఇల్లియ్యీన్‌లో దేవునివైపు తిరిగి ఫజ్ర్ నమాజు దారె ఇర్‌ఫాన్‌లో చేసింది. ఇక్కడ నాకు ఆయన విజయాత్మ దారుల్ ఇర్‌ఫాన్‌వైపు తిరిగి ఉన్నట్లు కనిపించింది. సోదరులు కర్నల్ మతలూబ్ హుసైన్‌గారు పవిత్ర భౌతిక కాయాన్ని దారుల్ ఇర్‌ఫాన్‌లో ఖననం చేసే విషయమై హజ్రత్‌జీగారి

---

1) ఖలీల్ అహ్మద్ సహారన్‌పూరిగారి అల్‌ముహింద్ అలల్ మన్‌ఫద్ 39వ పుట.
2) తారీఖె మషాయెఖె బిష్త్, మౌలానా జకరియా 234వ పుట.
3) ఇర్షాదుస్సాలికీన్-మొదటిభాగం-మౌలానా ముహమ్మద్ అక్రమ్. 25వ పుట.

https://teluguislam.net



అనుమతి తీసుకోరెందుకూ అని అదే పనిగా అడగసాగారు. నేను (అనుమతి తీసుకోవటానికి) శాయశక్తులా ప్రయత్నించాను. "మీ ఇంటివారికి ఇక్కడ ఒక ఇల్లు నిర్మించి ఇస్తాం. ఇక్కడ వారు అన్నివిధాలా సంతోషంగా ఉంటారు-ఇన్షాఅల్లాహ్" అని చెప్పాను.కాని అందుకాయన ఒప్పుకోలేదు. పైగా ఇలా అన్నారు: "జీవితంలో ఎంతోమందికి నా మీద నమ్మకం ఉండేది. అల్లాహ్ నన్ను వారికి ఆధారంగా చేశాడు. మీరు వారందరిని ఇక్కడికి తీసుకురాలేరు. జీవితంలో నేను ఏ విధంగా ఆధారంగా ఉన్నానో ఇకనుంచి నా సమాధి వారికి ఆధారంగా ఉంటుంది.[1]

11) అబూ సయీద్‌ఫరాజ్ (ఖద్దసల్లాహు సిర్రహూ) కథనం: నేను మక్కాలో ఉన్నప్పుడు బనూషైబా ద్వారం వద్ద ఒక యువకుణ్ణి చూశాను. అతను చనిపోయి ఉన్నాడు. నేను అతనివైపు దృష్టిసారించిన్పుడు అతను నా వైపు చూసి చిరునవ్వు నవ్వుతూ "అబూ సయీద్! నీకు ఈ విషయం తెలియదా దేవుని ప్రియదాసులు పైకి చనిపోయినప్పటికి సజీవంగానే ఉంటారు. నిజానికి వారు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి వెళతారు.[2]

పైన పేర్కొనబడిన విశ్వాసాలన్నిటికి మూలాధారం మృతులు వింటారనే నమ్మకం. కాని దైవగ్రంథం, దైవప్రవక్త హదీసుల వెలుగులో అసలు ఈ నమ్మకం సరైనదో కాదో చూడాలి.

## మృతులు వినటం-దైవగ్రంథం, ప్రవచనాల వెలుగులో

మొదటి నుంచి చివరిదాకా మానవజీవితం మొత్తాన్ని మనం ఈ క్రింద పేర్కొనబడిన ఐదు దశలుగా వర్గీకరించగలం.

1) ఆత్మల లోకం: అల్లాహ్ ఆదం అలైహిస్సలామ్‌ను పుట్టించిన తర్వాత ఆయన వీపునుంచి ప్రళయంవరకూ రానున్న ఆయన సంతానం ఆత్మలను పుట్టించాడు. వాటికి ఆలోచించే, మాట్లాడేశక్తిని ప్రసాదించి వాటి చేత తాను విశ్వమంతటికీ ఏకైక ప్రభువు అన్న ఒప్పుకోలును ఈ మాటల్లో ఒప్పించాడు. వారిని 'అలస్తు బిరబ్బికుమ్' (నేను మీ ప్రభువును కానా!) అని అడిగాడు. దానికి ఆత్మలన్నీ "బలా (ఎందుకు కారు! మీరే మా ప్రభువు)" అని సమాధానమిచ్చారు.[3] ఈ ఆత్మలోకం నుంచే మానవ జీవిత ప్రయాణం మొదలవుతుంది.

2) మాతృ గర్భలోకం: మాతృగర్భంలో ఆత్మతోపాటు మనిషి దేహనిర్మాణం కూడా జరుగుతుంది. ఈ లోకంలో మనిషి ఇంచుమించు తొమ్మిది నెలలపాటు ఉంటాడు.

---

1) ఇర్షాదుస్సాలికీన్-మొదటి భాగం-మౌలానా ముహమ్మద్ అక్రమ్-20వ పుట.
2) రిసాలా అహకాము ఖుబూరిల్ మూమినీన్-రెండో సంపుటి-243వ పుట.
3) మరిన్ని వివరాలకు ఆరాఫ్ సూరా 172వ సూక్తి చూడండి.

https://teluguislam.net



అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో అక్కడక్కడా కొన్నిచోట్ల మాతృగర్భంలో మనిషి పుట్టుక పరిణామ దశలను గురించి వివరించాడు. ఒకచోట ఇలా సెలవిచ్చాడు:
మానవుని తల్లి ఎంతో శ్రమకోర్చి అతన్ని తన గర్భంలో పెట్టుకొని మోసింది. ఎంతో శ్రమకోర్చి అతన్ని కన్నది. (అహ్ఖాఫ్ సూరా. 15వ సూక్తి) మనిషి జీవిత ప్రయాణంలో ఇది రెండవ దశ. ★

**3)** జీవలోకం: జీవిత ప్రయాణంలో మూడోదశ ఇది. ఇందులో ఓ సంక్షిప్త కాలంపాటు మనిషి జీవించి ఉంటాడు. "నా సమాజంలోని ప్రజల వయస్సులు అరవై-డెబ్భై ఏళ్ల మధ్యన ఉంటాయి" అని దైవప్రవక్త (సల్లం) ప్రవచించారు (తిర్మిజీ). ఇంచుమించు ఇంతకాలమే మానవులు ఈ ప్రపంచంలో జీవించి ఉంటారు. ఆ తర్వాత తమ ప్రయాణంలోని తర్వాతి దశకు బయలుదేరుతారు.

**4)** సమాధి లోకం: మన ఈ ప్రయాణంలో సమాధిలోకం (జీవలోకంతో పోల్చుకుంటే) చాలా పెద్ద దశ. ఆదం అలైహిస్సలామ్ నుంచి నేటివరకు దాదాపు ఆరువేల సంవత్సరాల కాలం గడిచిందని చెబుతారు (నిజమేమిటో అల్లాహ్‌కే తెలుసు). చనిపోయిన వారు తమసమాధుల్లో పడి ఉన్నారు. వారి ప్రయాణం కొనసాగుతోంది. ఎప్పటి వరకు కొనసాగుతుందో తెలీదు. సమయం వచ్చినప్పుడు మనలోని ప్రతి ఒక్కడూ ఈ సమాధిలోక ప్రయాణ బృందంలోకి చేరుకుంటూ ఉంటాడు. ఈ ప్రయాణం ప్రళయం వరకూ కొనసాగుతుంది.

**5)** పరలోకం: ఇది మన ప్రయాణానికి అంతిమగమ్యం. ఇందులో మనిషి తన ప్రాపంచిక దేహం, ప్రాణాలతో సహా బతికించబడతాడు. అతను చేసిన మంచీ చెడుల విచారణ జరుగుతుంది. ఆ తర్వాత ప్రజలు తమ తమ వాస్తవ నివాసస్థలాల్లో అంటే.... స్వర్గం లేక నరకంలో.... శాశ్వతంగా నివాసముంటారు.

పైన పేర్కొనబడిన ఐదు దశలను శ్రద్ధగా పరిశీలిస్తే బోధపడేదేమిటంటే-ప్రతి దశలోని పరిస్థితులు రెండోదశకు పూర్తిగా భిన్నంగా ఉంటాయి. ఉదా: మొదటి దశ అనగా ఆత్మలలోకంలో అల్లాహ్ ఆత్మలన్నిటిని 'నేను మీ ప్రభువును కానా?' అని అడిగాడు. ఆత్మలు విన్నాయి, ఆలోచించాయి, అర్థం చేసుకున్నాయి. ఆ తర్వాత "ఎందుకు కాదు!" అని బదులిచ్చాయి. అయితే ఆత్మలలోకంలో వినటం, ఆలోచించటం, మాట్లాడటం ఈ ప్రపంచంలో వినటం, మాట్లాడటం ఈ భౌతికలోకంలో మాట్లాడటం, ఆలోచించటం, వినటానికి భిన్నంగానే ఉంటుంది. ఆత్మలలోకంలో ఆత్మలు వింటాయని, ఆలోచిస్తాయని, మాట్లాడతాయని మనం నమ్ముతాం. అయితే దాని స్వభావం మాత్రం కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.

---

★ మరిన్ని వివరాల కోసం చూడండి. నహ్ల సూరా 78వ సూక్తి, మూమినూన్ సూరా 14వ సూక్తి, లుఖ్మాన్ సూరా 14వ సూక్తి మొదలగునవి.

https://teluguislam.net



ఇప్పుడు రెండో దశ (అనగా మాతృగర్భలోకం) ను గమనించండి. ఇందులో మనిషి దేహనిర్మాణం జరుగుతుంది. ఆత్మ-దేహం రెండూ కలుస్తాయి. హృదయం, మెదడు, కళ్లు, ముక్కు చెవులు అన్నీ తయారవుతాయి. కాని గర్భలోకం బయటిలోకానికి ఎంత భిన్నంగా ఉంటుందంటే మాతృగర్భంలో ఉన్న పిల్లవాడితో "కొంతకాలం తర్వాత నువ్వు ఒక లోకంలోకి రాబోతున్నావు. అక్కడ వేలమైళ్ల ఎత్తైన, అత్యంత విశాలమైన ఆకాశం ఉంది. కనుచూపుమేరకు పరువబడి ఉన్న నేల ఉంది. భూమికంటే పెద్దదైన భగభగమండే ఓ అగ్నిగోళం... సూర్యుడు.... ప్రతిరోజూ ఆకాశంలోని ఒక దిక్కునుంచి ఉదయించి ప్రపంచమంతటినీ వెలిగిస్తూ కొన్ని గంటల తర్వాత రెండో దిక్కున అస్తమిస్తాడు. దాంతో ప్రపంచమంతా చీకటి ఆవరిస్తుంది. రాత్రిపూట ఆకాశాన ఓ అందమైన ధగధగమెరిసే చంద్రుడు ఉదయిస్తాడు. దాంతోపాటు కోట్లాది చిన్న చిన్న నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ ప్రకాశిస్తూ ఉంటాయి" అని చెబితే అతి చిన్న మాతృగర్భలోకంలో నివసిస్తున్న ఆ చిన్ని మనిషి ఆ వాస్తవాలు నిజమని ఒప్పుకోగలడా? చెప్పండి!

నిజం చెప్పాలంటే మాతృగర్భపు అతి చిన్న లోకంలో ఉంటూ ఈ భౌతిక ప్రపంచ వాస్తవాలను గ్రహించటం అసలు సాధ్యమే కాదు. మనిషి యొక్క ఈ స్థితిని అల్లాహ్ దివ్యఖుర్ఆన్‌లో కొన్ని మాటల్లో చాలా చక్కగా సమీక్షించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَاللَّهُ أَخْرَجَكُمْ مِنْ بُطُونِ أُمَّهَاتِكُمْ لَا تَعْلَمُونَ شَيْئًا﴾

"అల్లాహ్ మిమ్మల్ని మీ మాతృగర్భాల నుంచి మీరు ఏమీ ఎరుగని స్థితిలో ఉండగా బయటికి తీశాడు." (నహ్ల్ సూరా 78వ సూక్తి).

ఇప్పుడు నాల్గోదశ అనగా సమాధిలోకాన్ని గమనించండి. సమాధిలోకం గురించి దైవగ్రంథం, దైవప్రవక్త హదీసుల ద్వారా మనకు బోధపడే వాస్తవాలు క్రింద పేర్కొనబడ్డాయి.

1) మృతులు మాట్లాడతారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: మరణానంతరం మంచి మనిషి మృతదేహం తన ఇంటివారితో "నన్ను త్వరగా తీసుకెళ్ళండి, నన్నుత్వరగా తీసుకెళ్ళండి" అని అంటుంది. అదే చెడ్డవాడి మృతదేహమయితే "అయ్యో! నా పాడుగాను నన్ను ఎక్కడికి తీసుకెళ్తున్నారు" అని అంటుంది (బుఖారీ). పై హదీసు ద్వారా మరణానంతరం మృతదేహం మాట్లాడగలదనే విషయం రుజువు అవుతోంది. ముంకిర్ నకీర్ దూతలు అడిగే ప్రశ్నలకు మంచిమనిషి తనకు దేవునిపై, దైవప్రవక్తపై విశ్వాసం ఉందని సాక్ష్యం పలుకుతాడు. అదే అవిశ్వాసో లేక కపటో అయితే "అయ్యో! అయ్యో! నాకేం తెలీదు" అని వాపోతాడు. (బుఖారీ, అబూదావూద్ వగైరా).

https://teluguislam.net


పై హదీసుల ద్వారా మృతులు మాట్లాడతారనే విషయంతోపాటు మాట్లాడే ఈ గుణానికి ఒకరి మంచితనంతో, ఒకరి దైవప్రియత్వంతో ఎలాంటి సంబంధం ఉండదనీ, మృతుడు విశ్వాసి అయినా, అవిశ్వాసి అయినా మంచివాడయినా చెడ్డవాడయినా ప్రతి ఒక్కరూ మాట్లాడగలరని రుజువు అవుతోంది.

2) మృతులు వింటారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: (విశ్వాసి లేక అవిశ్వాసి అయిన) దాసుడు సమాధిలో ఖననం చేయబడిన తర్వాత తన దగ్గరినుంచి తిరిగి వెళుతున్నవారి చెప్పుల శబ్దం వింటాడు (ముస్లిం).

సమాధిలో ముంకిర్ నకీర్ అడిగే ప్రశ్నలు మృతుడు వింటాడు. తన విశ్వాసం ప్రకారం దానికి సమాధానం కూడా ఇస్తాడు. (74వ అంశం క్రింది హదీసు చూడండి).

బద్ర్ యుద్ధానంతరం దైవప్రవక్త (సల్లం) యుద్ధంలో హతులైన అవిశ్వాసులను ఉద్దేశించి ఇలా అన్నారు: "మీ ప్రభువు మీతో చేసిన వాగ్దానం నిజమయిందా? నా ప్రభువు నాకు చేసిన వాగ్దానం మాత్రం నిజమయింది" అని అన్నారు. అది విని ఉమర్(రజి) సందేహపడుతూ "దైవప్రవక్తా! వీళ్లు చచ్చిపోయారు కదా! వీరు వినగలరా? జవాబు చెప్పగలరా?" అని అడిగారు. అందుకు దైవప్రవక్త (సల్లం) "ఎవరి చేతిలోనయితే నా ప్రాణముందో ఆయన సాక్షిగా చెబుతున్నాను. నేను వారితో చెప్పే మాటలు మీరు వారి కన్నా ఎక్కువేమీ వినలేరు. కాకపోతే వీరు (మీలాగా) సమాధానం పలకలేరు అంతే " అని చెప్పారు (ముస్లిం).

ఈ హదీసుల ద్వారా కూడా మృతులు వింటారని బోధపడుతోంది. అంతేకాదు, మృతులు మాట్లాడటం దేవుని పట్ల వారికున్న ప్రేమకో లేక వారి మంచితనానికో నిదర్శనం కాదు. ప్రతి మృతుడు, అతను విశ్వాసి అయినా, అవిశ్వాసి అయినా మంచివాడయినా చెడ్డవాడయినా వింటాడు.

3) మృతులు చూస్తారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: సమాధిలో ముంకిర్ నకీర్ అడిగే ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పి విజయం సాధించిన విశ్వాసికి ముందు నరకం చూపెట్టబడుతుంది. తర్వాత స్వర్గంలోని అతని నివాసం చూపెట్టబడుతుంది. అలాగే విఫలుడైన అవిశ్వాసికి ముందు స్వర్గం చూపెట్ట బడుతుంది. ఆ తర్వాత నరకం, నరకంలో అతని నివాసం చూపెట్టబడుతుంది. (అహ్మద్, అబూదావూద్ వగైరా) దీని ద్వారా మృతుడు విశ్వాసి అయినా అవిశ్వాసి అయినా అందరూ చూడగల్గుతారు.

4) మృతులు లేస్తారు, కూర్చుంటారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: ముంకిర్ నకీర్ దూతలు సమాధిలోకి వచ్చి మృతుణ్ణి (లేపి) కూర్చోబెడతారు. (బుఖారీ, ముస్లిం, అహ్మద్ వగైరా)

5) మృతులు క్షోభను, ఆనందాన్ని అనుభవిస్తారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

https://teluguislam.net



(సమాధిలో) ముంకిర్ నకీర్ దూతలు అవిశ్వాసిని లేపినప్పుడు అతను తీవ్ర భయాందోళనలకు గురై ఉంటాడు. అదే విశ్వాసి అయితే ఎలాంటి భయాందోళనలు లేకుండా (ప్రశాంతంగా) లేచి కూర్చుంటాడు (అహ్మద్). దైవప్రవక్త (సల్లం) ఇలా కూడా చెప్పారు: నరకంలో తన నివాసం చూసుకున్న తర్వాత అవిశ్వాసికి దుఃఖం, పశ్చాత్తాపం మరింత పెరిగిపోతుంది. మరోవైపు స్వర్గంలో తన నివాసం చూసుకొని విశ్వాసి ఆనందం, మధురానుభూతులు మరింత పెరిగిపోతాయి.

(తబ్రానీ, ఇబ్నె హిబ్బాన్, హాకిమ్)

**6)** మృతులు కోరుతారు, కాంక్షిస్తారు: దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "సమాధిలో విశ్వాసికి స్వర్గదర్శనం చేయించినప్పుడు అతను "నన్ను కాస్త వదలండి. ఈ శుభవార్త మా ఇంటివారికి తెలియజేసి వస్తాను" అని కోరుతాడు. మరొక హదీసులో ఇలా ఉంది: విశ్వాసి "ప్రభూ! ప్రళయాన్ని త్వరగా నెలకొల్పు" అని కోరుకోగా అవిశ్వాసి "ప్రభూ! ప్రళయాన్ని నెలకొల్పమాకు" అని కోరుకుంటాడు. (అహ్మద్, అబూదావూద్) పై హదీసుల ద్వారా మృతులు కాంక్షిస్తారని, కోరుకుంటారని రుజువు అవుతోంది.

**7)** మృతులు నిద్రపోతారు, మేల్కొంటారు: దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: సమాధిలో ప్రశ్నోత్తరాలు జరిగిన తర్వాత విశ్వాసితో "నూతన వధువుని ఆమె ఇంటివారిలో ఆమెకు అత్యంత ప్రియుడైన వాడు (భర్త) తప్ప మరెవరూ లేపరు. నువ్వూ ఆ విధంగా నిద్రపో" అని చెప్పటం జరుగుతుంది (తిర్మిజీ). దీని ద్వారా మృతులు నిద్రపోతారని, ప్రళయదినాన మేల్కొంటారని రుజువు అవుతోంది.

**8)** మృతులు గుర్తుపడతారు: దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: సమాధిలో విశ్వాసి దగ్గరికి ఒక అందమైన వ్యక్తి అందమైన దుస్తులు ధరించి మంచి సువాసనలు పూసుకొని వస్తాడు. వచ్చి విశ్వాసికి మంచి పరిణామం ఎదురుకాబోతుందని శుభవార్త అందజేస్తాడు. విశ్వాసి "నీ ముఖం ఎంత అందంగా ఉంది? నువ్వు శుభశ్రేయాలు తీసుకొని వచ్చావు. అసలు ఎవరు నువ్వు?" అని అడుగుతాడు. దానికతను "నీ సదాచరణను" అని సమాధానం పలుకుతాడు. అవిశ్వాసి దగ్గరికి ఒక కురూపి దుర్గంధవస్త్రాలు ధరించి వస్తాడు. అతని దగ్గర దుర్వాసన వస్తూ ఉంటుంది. అతనొచ్చి అవిశ్వాసితో "నీకు దుష్పరిణామ శుభవార్త! నీకు వాగ్దానం చేయబడిన రోజే ఇది" అని అంటాడు. దానికి అవిశ్వాసి "ఒరేయ్ కురూపీ! నువ్వు అశుభం తీసుకొని వచ్చావు. అసలు ఎవరు నువ్వు" అని అడుగుతాడు. దానికతను "నేను నీ దురాచరణను" అని చెబుతాడు. (అహ్మద్, అబూదావూద్) ఈ హదీసుల ద్వారా మృతులు గుర్తుపడతారని అర్థమవుతోంది.

**9)** మృతులు అరుస్తారు, కేకలు పెడతారు: దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు:

https://teluguislam.net



సమాధిలో అవిశ్వాసిని శిక్షించటం కోసం గుడ్డి, చెవిటి దూత (లేక దూతలు) నియమించబడతారు. వారు అతన్ని ఇనుపగదలతో మోదుతుంటారు. దాంతో అతను చాలా భయంకరంగా అరుస్తాడు. కేకలు పెడతాడు. అవిశ్వాసి అరుపులు, కేకలు జిన్నాతులు, మానవులు తప్ప సృష్టిలోని ప్రతి జీవి వింటుంది (అహ్మద్, అబూదావూద్). ఈ హదీసు ద్వారా మృతులు అరిచికేకలు కూడా పెడతాయని బోధపడుతోంది.

10) మంచిమృతులు సజీవంగానే ఉన్నారు. తింటూ తాగుతూ ఉంటారు:

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

﴿وَلَا تَحْسَبَنَّ الَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتًا بَلْ أَحْيَاءٌ عِندَ رَبِّهِمْ يُرْزَقُونَ﴾

అల్లాహ్ మార్గంలో హతులైనవారిని మృతులుగా భావించకండి. వారు (సమాధి లోకంలో) సజీవంగానే ఉన్నారు. తమ ప్రభువు దగ్గర జీవికను పొందుతున్నారు. (అలిఇమ్రాన్ సూరా, 169వ సూక్తి)

పైన పేర్కొనబడిన దివ్యఖుర్‌అన్ సూక్తులు, దైవప్రవక్త హదీసుల ద్వారా స్పష్టమయ్యేదేమిటంటే సమాధిలోక జీవితం ఒక పరిపూర్ణ జీవితం. అందులో మృతుడు తింటాడు, తాగుతాడు, వింటాడు, మాట్లాడతాడు, చూస్తాడు గుర్తుపడతాడు, ఆలోచిస్తాడు, అర్థం చేసుకుంటాడు, ఆనందాన్ని సంతోషాన్ని అనుభవిస్తాడు, ఏడుస్తాడు, మొత్తుకుంటాడు, అరుస్తాడు, కేకలు పెడతాడు. కాని సమాధిలోకంలో మృతుని వినికిడి ఇహలోక వినికిడి కన్నా భిన్నమైనది. సమాధి లోకంలో మృతుడు మాట్లాడటం ఇహలోకంలో మాట్లాడటం కన్నా భిన్నమైనది. సమాధిలోకంలో మృతుడు చూసి గుర్తుపట్టటం ఇహలోకంలో మాట్లాడటం కన్నా భిన్నమైనది. సమాధిలోకంలో మృతుని తినటం తాగటం ఇహలోకంలో తినటం తాగటం కన్నా భిన్నమైనది. సమాధిలోకంలో మృతుడు ఆలోచించటం, అర్థం చేసుకోవటం ఇహలోకంలో ఆలోచించటం, అర్థం చేసుకోవటం కన్నా భిన్నమైనది. సమాధిలోకంలో మృతుడు ఆనందాన్ని సంతోషాన్ని అనుభవించటం. ఇహలోకంలో ఆనందాన్ని, సంతోషాన్ని అనుభవించటం కంటే భిన్నమైనది. సమాధిలోకంలో అవిశ్వాసమృతుడు దుఃఖాన్ని, పశ్చాత్తాపాన్ని అనుభవించటం ఇహలోకంలో దుఃఖాన్ని, పశ్చాత్తాపాన్ని అనుభవించటం కంటే భిన్నమైనది. సమాధిలోకంలో మృతుడు ఏడ్వటం, మొత్తుకోవటం, అరచి కేకలు పెట్టటం ఇహలోకంలో ఏడ్వటం మొత్తుకోవటం, అరచికేకలు పెట్టటం కంటే భిన్నమైనది. వాటిని ఈ రోజు మనం ఈ భౌతిక ప్రపంచంలో ఉండి అర్థం చేసుకోలేము. వాస్తవం ఏమిటంటే ఏ విధంగానయితే ఆత్మలలోకపు పరిస్థితులను అర్థం చేసుకోవటం మనకు అసాధ్యమో లేక మాతృగర్భంలో పెరిగే శిశువుకి మన ఈ భౌతిక ప్రపంచ పరిస్థితులను గ్రహించటం

https://teluguislam.net



ఏ విధంగానయితే అసాధ్యమో అదేవిధంగా మనం ఈ భౌతిక ప్రపంచంలో ఉంటూ సమాధిలోకపు పరిస్థితులను అర్థం చేసుకోవటం, వాటిని గ్రహించటం మనకు అసాధ్యం. దివ్యఖుర్‌ఆన్ ఈ అభిప్రాయాన్ని, ఈ భావనను చాలా స్పష్టమైన మాటల్లో బలపరిచింది.

﴿وَلَا تَقُولُوا لِمَنْ يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ بَلْ أَحْيَاءٌ وَلَٰكِنْ لَا تَشْعُرُونَ﴾

అల్లాహ్ మార్గంలో హతులైనవారిని మృతులు అని అనకండి. వారు (సమాధి లోకంలో) సజీవంగా ఉన్నారు. కాని (వారి జీవితాన్ని మీరు అర్థం చేసుకోలేరు). (బఖరా సూరా 154వ సూక్తి).

దేవుని ఈ స్పష్టమైన సూక్తి తెలిసిన తర్వాత కూడా ఎవరయితే తాము సమాధి లోక జీవితాన్ని అర్థం చేసుకోగలమనీ, మృతులు ఇహలోకంలో విన్నట్లే వింటారు. ఇహలోకంలో మాట్లాడినట్లే మాట్లాడతారు, ఇహలోకంలో తిన్నట్లే తింటారు అన్న సంగతి తమకు తెలుసని మొండివాదన చేస్తారో వారి ఈ అభిప్రాయం బుద్ధిరీత్యా సరైనది కాకపోవటమే కాదు. వారు పైన పేర్కొనబడిన దివ్యఖుర్‌ఆన్ సూక్తిలోని "మీరు అర్థం చేసుకోలేరు" అన్న వాక్యాన్ని కూడా ధిక్కరిస్తున్నారు.

అసలు మృతులు (మనలాగే) వింటారని నమ్మేవారినే అడుగుదాం. ఏమండి సమాధి లోకంలో ప్రతి మృతుడూ (అతను ముస్లిం అయినా కాఫిర్ అయినా, మంచివాడయినా చెడ్డవాడయినా, వలీ అయినా కాకపోయినా) వింటాడనీ, మాట్లాడతాడనీ, చూస్తాడనీ, గుర్తుపడతాడనీ, విశ్వాసి అయితే సంతోషాన్ని ఆనందాన్ని అనుభవిస్తాడనీ, ప్రళయం నెలకొనాలని కోరుకుంటారనీ రుజువు ఉండగా మీరు ఎప్పుడూ వలీల వినికిడి గురించే మాట్లాడతారెందుకు? వలీలు కాని వారి వినికిడి మాటే ఎత్తరు. రెండో ప్రశ్న ఏమిటంటే -మీరు ఎప్పుడూ వలీలు 'వింటారనే' విషయం గురించి మాత్రమే చర్చిస్తారు. వారి ఇతర పనులు అనగా మాట్లాడటం, చూడటం, గుర్తుపట్టడం, ఆనందాన్ని సంతోషాన్ని అనుభవించటం తినటం త్రాగటం ఇతర పనులు చేయటం గురించి చర్చించుకోరు ఎందుకనీ?

కారణం తెలుస్తూనే ఉంది. ఔలియాలు, పుణ్యాత్ములు సమాధుల్లో వింటారనే నమ్మకాన్ని ఆధారంగా చేసుకుని వారి సమాధుల దగ్గర హాజరుపలకటం, అవసరాలు తీర్చమని కోరటం, కోరికలు కోరటం, కష్టాల్లో, బాధల్లో వారిని మొరపెట్టుకోవటం, వారిచేత క్షమాభిక్ష పెట్టించుకోవటం మొదలగు పనులన్నీ చేయవచ్చనే నమ్మకం ప్రతిపాదించబడుతుంది. ఆ తర్వాత ఆ నమ్మకం ఆధారంగానే ప్రజలనుంచి కానుకలు, నజరానాలు వసూలు చేస్తారు. సమాధి జీవితంలో మృతులు వినటమే కాదు, మాట్లాడతారు, చూస్తారు, గుర్తుపడతారు, తింటారు తాగుతారు, ఆనందం, సంతోషాలు అనుభవిస్తారు. కాని ఇదంతా ప్రపంచ జీవితంలో లాగా ఉండదు.

https://teluguislam.net


అది ఈ లోకానికి పూర్తిగా భిన్నంగా ఉంటుంది అని ప్రజలకు నిజం చెప్పేస్తే ఫలితంగా మఠాల వ్యాపారమంతా కుప్పకూలిపోతుంది. సమాధుల అందాలు, అక్కడి కచేరీలు, సమావేశాలు పాడుబడిపోతాయి. దర్గాలకు భారీమొత్తంలో ప్రభుత్వం ఇచ్చే వేతనాలు, గ్రాంట్లు ఆగిపోతాయి. సామాన్య మానవుల్లాగా 'సజ్జాదానషీన్' 'గద్దీనషీన్' 'మఖ్దూమ్' 'దర్వేష్ 'ముజావర్' మొదలగు కుహనా పూజారులందరూ పొట్టకూటి కోసం కష్టపడి పనిచేయాల్సి వస్తుంది. ఆ బాధ, ఆ కష్టం కావాలని ఎవరు కొని తెచ్చుకుంటారండీ?!

## అమరవీరుల సమాధి జీవితం

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ రెండుచోట్ల అమరవీరులను సజీవులు (అహ్యా) అన్నాడు. తర్వాత అక్కడే వారిని మృతులు అని అనకండని కూడా వారించాడు. మృతులు వింటారని నమ్మేవారి దృష్టిలో ఈ రెండు సూక్తులు షహీదులు (వారితోపాటు ఇతర వలీలు, పుణ్యాత్ములు) సమాధుల్లో సజీవులుగా ఉన్నారనేందుకు పెద్ద రుజువులు. అహ్లెసున్నత్‌ల అతిగొప్ప ఇమాము అయిన అహ్మద్ రజా ఖాన్ బరేల్వీ తన ఒక గ్రంథంలో ఈ సంఘటన రాశాడు. "ఇద్దరు అన్నదమ్ములు అల్లాహ్ మార్గంలో వీర మరణం పొందారు. వారి మూడో తమ్ముడు ఇంకా బతికే ఉన్నాడు. అతని పెళ్ళిరోజున అమరగతులైన ఆ ఇద్దరు అన్నదమ్ములు కూడా అతని పెళ్ళికి హాజరయ్యారు. మూడో తమ్ముడు చాలా ఆశ్చర్యపోయాడు. "మీరు మరణించారు కదా!" అని అడిగాడు. దానికి వారు అల్లాహ్ మమ్మల్ని నీ పెళ్ళి శుభకార్యంలో పాల్గొనమని పంపించాడు అని చెప్పారు. ఆ విధంగా ఇద్దరు అన్న దమ్ములు తమ మూడో తమ్ముడి పెళ్ళిలో ఖుత్బాపఠించి తిరిగి (సమాధి లోకానికి) వెళ్ళిపోయారు. ★

అమరవీరులు, వలీలు, మహాత్ములు తమ సమాధుల్లో సజీవంగా ఉన్నారని రూఢీ చేసిన తర్వాత వారిని తమ అవసరాలు తీర్చమని కోరటం, వారికి విన్నపాలు చేసుకోవటం, కష్టాల్లో బాధల్లో వారిని మొరపెట్టుకోవటం, వారి పేర మొక్కుబడులు చేసుకోవటం, వారి సమాధుల దగ్గర బలులు ఇవ్వటం, జాతరలు చేయటం అంతా ధర్మసమ్మతమని రుజువు అవుతుంది. మేము ఇంతకు ముందు పుటల్లో పేర్కొన్నట్లు మృతులు వింటారనే నమ్మకం కలిగివున్నవారికి ఇక్కడ కూడా అదే అపోహ కలిగింది. అదేమిటంటే వారు అమరగతుల సమాధి జీవితం ఇహలోకపు జీవితంలా ఉంటుందని భ్రమపడ్డారు. సమాధి లోకంలో వారి తినటం, త్రాగటం ఇహలోకంలో తినటం త్రాగటం లాంటిదనుకున్నారు. సమాధి లోకంలో వారు వినటం, మాట్లాడటం ఇహలోకంలో వినటం, మాట్లాడటం లాంటిదనుకున్నారు.ఈ విషయాన్ని మేము

★ మజ్మూఅ రసాయెల్ ఆలా హజ్రత్ మొదటి సంపుటి 175వ పుట.

https://teluguislam.net



ఇంతకు ముందు కూడా వివరించాం. సమాధిలోక జీవితం ఒక పరిపూర్ణ జీవితం. అక్కడ మృతులు తినటం, త్రాగటం, మాట్లాడటం, వినటం, చూడటం గుర్తుపట్టడం, ఆలోచించటం, సంతోషించటం మొదలగు పనులన్నీ చేస్తారని రుజువు ఉంది. కాని అవన్నీ ప్రపంచంలోని తినటం తాగటం మాట్లాడటం వినటం, చూడటం, గుర్తుపట్టడం, ఆలోచించటం, సంతోషించటం కంటే భిన్నమైనవి. పైన పేర్కొనబడిన రెండు ఖుర్‌ఆన్ సూక్తుల అవతరణ నేపథ్యం కూడా అసలు నిజాన్ని తెలుసుకోవటంలో చాలా తోడ్పడుతుంది. కనుక ఇక్కడ మేము ఆ రెండు సూక్తుల నేపథ్యాన్ని వివరించదలచుకున్నాం.

ముందుగా బఖర సూరాలోని ఈ సూక్తి

﴿وَلَا تَقُولُوا لِمَنْ يُقْتَلُ فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتٌ بَلْ أَحْيَاءٌ وَلَٰكِنْ لَا تَشْعُرُونَ﴾

అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులు అని అనకండి. వారు సజీవంగానే ఉన్నారు. కాని (వారి జీవితాన్ని) మీరు అర్థం చేసుకోలేరు. (బఖర:154)

ఈ అమరగతులను 'సజీవులు' అని అన్న నేపథ్యం ఏమిటంటే బద్ర్ యుద్ధంలో అమరగతులైన దైవప్రవక్త అనుచరుల గురించి అవిశ్వాసులు మాట్లాడుకుంటూ "ఫలానా ఫలానా వాళ్లు చచ్చిపోయారు, జీవిత సౌఖ్యాలను కోల్పోయారు" అని అన్నారు. దానికి సమాధానంగా "అమరగతులను మృతులు అని అనకండి. వారు జీవించే ఉన్నారు" అన్న ఈ సూక్తి అవతరించింది. దైవప్రవక్త (సల్లం)ను ఈ సూక్తి భావం గురించి అడగ్గా ఆయన ఈ విధంగా వివరించారు:

"అమరవీరుల ఆత్మలు పచ్చటి పక్షుల రూపంలో దైవసింహాసనానికి వేలాడబడి ఉండే గాజు గుప్పెల్లో ఉంటాయి. తాము తలచినప్పుడు స్వర్గంలో విహరించటానికి వెళ్తాయి. తర్వాత ఆ గాజుగుప్పెల్లోకి తిరిగివెళ్తాయి. ఒకసారి వారి ప్రభువు వారివైపు దృష్టిసారించి "మీరు ఏం కోరుకుంటారు?" అని అడిగాడు. అందుకు ఆత్మలు "మేము స్వర్గంలో ఎక్కడికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్ళి విహరించి వస్తున్నాం. మాకు ఇంకా ఏం కావాలి?" అని అన్నారు. అల్లాహ్ వారిని మూడుసార్లు ఇదే ప్రశ్న అడిగాడు. ఆఖరికి ఆత్మలు తాము ఏదో ఒకటి అడగటం తప్పదనుకొని "ప్రభూ! మా ఆత్మలు తిరిగి మా దేహాలలోకి పంపించబడాలి. తర్వాత మేము నీ మార్గంలో మళ్ళీ చంపబడాలని మా కోరిక" అని విన్నవించుకున్నారు. దాంతో అల్లాహ్ వారికి ఇక ఏ కోరికా లేదని భావించి వారిని అలాగే వదిలేశాడు. (ముస్లిం)

రెండోది ఆలి ఇమ్రాన్ సూరాలోని ఈ సూక్తి:

﴿وَلَا تَحْسَبَنَّ الَّذِينَ قُتِلُوا فِي سَبِيلِ اللَّهِ أَمْوَاتًا بَلْ أَحْيَاءٌ عِنْدَ رَبِّهِمْ يُرْزَقُونَ﴾

అల్లాహ్ మార్గంలో చంపబడ్డవారిని మృతులుగా భావించకండి. వారు జీవించే ఉన్నారు. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతున్నారు. (ఆలి ఇమ్రాన్:169).

https://teluguislam.net



ఈ సూక్తిలో అమరవీరుల్ని 'సజీవులు' అన్న నేపథ్యం ఏమిటంటే ఉహుద్ యుద్ధ సమయంలో దైవప్రవక్త (సల్లం) మదీనా నగరానికి బయట యుద్ధభూమిలోకి వెళ్ళి మక్కా అవిశ్వాసులతో పోరాడాలని తీర్మానించారు. కపటులు దానికి ఒప్పుకోలేదు. పైగా నగరంలోనే ఉండి పోరాడాలనే తమ తీర్మానాన్ని దైవప్రవక్త ఒప్పుకోలేదన్న వంకతో తాము యుద్ధంలో పాల్గొనమని చెప్పి జిహాద్ చేయకుండా తిరిగి వెళ్ళిపోయారు. యుద్ధం తర్వాత వారు "ముస్లింలు మా మాట విని ఉంటే యుద్ధంలో ఇలా చచ్చి ఉండేవారు కాదు" అని ఎత్తిపొడవసాగారు. కపటుల ఎత్తిపొడుపులకు అల్లాహ్ ఈ మాటల్లో సమాధానం చెప్పాడు: "అల్లాహ్ మార్గంలో చంపబడేవారు మృతులు కారు. వారు జీవించే ఉంటారు. తమ ప్రభువు వద్ద జీవికను పొందుతుంటారు."

పైన పేర్కొనబడిన అలి ఇమ్రాన్ సూరాలోని సూక్తికి సంబంధించి ఉహుద్ యుద్ధంలో అమరగతులైన ఒకానొక దైవప్రవక్త అనుచరుడు, అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (రజి) గారి సంఘటన కూడా హదీసుల్లో ప్రస్తావించబడుతుంది. అబ్దుల్లాహ్ గారి కుమారుడు జాబిర్ (రజి)ని ఉద్దేశించి దైవప్రవక్త (సల్లం) "జాబిర్! అల్లాహ్ నీ తండ్రితో పలికిన మాట నేను నీకు తెలుపనా?" అని అడిగారు. అందుకు జాబిర్ (రజి) "తప్పకుండా తెలపండి దైవప్రవక్తా" అని విన్నవించుకున్నారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా చెప్పారు: అల్లాహ్ ఎవరితోనూ మధ్యలో అడ్డులేకుండా మాట్లాడలేదు. కాని ఆయన నీ నాన్నతో మధ్యలో అడ్డులేకుండానే (అంటే నేరుగా) సంభాషించాడు. ఆయన మీ నాన్నను "ఓ నా దాసుడా! నువ్వు ఏం కోరుకుంటావో కోరుకో. నేను అది నీకు ఇస్తాను" అని అన్నాడు. అందుకు మీ నాన్న "ఓ నా ప్రభూ! నన్ను తిరిగి బ్రతికించు నేను మళ్ళీ నీ మార్గంలో పోరాడి చంపబడతాను" అని కోరుకున్నాడు. దానికి అల్లాహ్ "మరణించిన తర్వాత ప్రపంచానికి తిరిగి వెళ్ళటం జరగదని మేము ముందే నిర్ణయించి ఉన్నాం కదా!" అని అన్నాడు. అందుకు మీ నాన్న "మరయితే ప్రభూ! నా తరఫున (ప్రపంచవాసులకు) ఈ సందేశం (అనగా మళ్ళీ బతికి అమరగతుడవ్వాలని కోరుకోవటం) పంపించు" అని కోరుకున్నారు. అప్పుడు అల్లాహ్ ఈ సూక్తి అవతరింపజేశాడు. అల్లాహ్ మార్గంలో చంపబడేవారిని మృతులుగా భావించకండి. వారు బ్రతికే ఉన్నారు. తమ ప్రభువు దగ్గర జీవికను పొందుతున్నారు. (అలి ఇమ్రాన్ సూరా, 169వ సూక్తి) (ఇబ్నెమాజా).

బఖర, అలి ఇమ్రాన్ సూరాల్లోని రెండు సూక్తుల వ్యాఖ్యానం ద్వారా ఈ క్రింది విషయాలు బోధపడుతున్నాయి.

1) షహీదుల (అమరగతుల) దేహాలు సమాధుల్లో ఉంటాయి. కాని వారి ఆత్మలను మాత్రం అమరగతి తర్వాత నేరుగా స్వర్గానికి పంపించటం జరుగుతుంది.

2) అమరవీరుల ఆత్మలు స్వర్గంలోకి వెళ్ళిన తర్వాత ప్రపంచంలోకి తిరిగి రావటం అసాధ్యం.

https://teluguislam.net



పైన పేర్కొనబడిన దైవగ్రంథం, దైవప్రవక్త హదీసు ఆధారాలతో పాటు ఈ క్రింద పేర్కొనబడే షరీఅత్ ఆదేశాలను కూడా ఒకసారి పరిశీలించండి. వీటి ద్వారా కూడా అమరవీరుల సమాధి లోక జీవితం ఇహలోక జీవితం లాంటిది కాదన్న భావన మరింత పటిష్టమవుతుంది.

1) సాధారణ ముస్లింలు చనిపోతే వారి వితంతువులకు పునర్వివాహం చేసుకోవటానికి అనుమతి ఉన్నట్లే అమరవీరులు, మహాత్ములు, వలీలు చనిపోయిన తర్వాత వారి వితంతువులకు కూడా పునర్వివాహం చేసుకోవటానికి అనుమతి ఉంది. ఒకవేళ (మీరన్నట్లు) అమరవీరులు, మహాత్ములు, వలీలు చనిపోయిన తర్వాత కూడా బతికే ఉంటే వారి వితంతువులకు పునర్వివాహం చేసుకునే అనుమతి ఎందుకు ఉంది?

2) సామాన్యంగా ముస్లింలు చనిపోతే వారి ఆస్తి పంపకం జరుగుతుంది. అలాగే అమరవీరులు, మహాత్ములు, వలీలు చనిపోతే కూడా అలాగే వారసులకు పంపిణీ చేయబడుతుంది. ఒకవేళ అమరవీరులు, మహాత్ములు, వలీలు బతికే ఉంటే వారి ఆస్తిని పంపిణి చేయమని షరీఅత్‌లో ఎందుకు ఆదేశించబడింది.

3) సామాన్య ముస్లింలు చనిపోయినప్పుడు వారి జనాజా నమాజులో మన్నింపు ప్రార్థన చేసినట్లే అమరవీరుల, మహాత్ముల, వలీల జనాజా నమాజుల్లోనూ అదే మన్నింపు ప్రార్థన జరుగుతుంది.

4) సామాన్య ముస్లింలు చనిపోతే వారిని సమాధిలో ఎలా పాతిపెడతారో అమరవీరుల్ని, మహాత్ముల్ని, వలీలను కూడా అలాగే పాతిపెడతారు. ఒకవేళ వారు మరణించిన తర్వాత కూడా ఈ ప్రపంచపు జీవితంలా జీవించి ఉంటే మరి వారిని సమాధిలో పాతిపెట్టమని ఎందుకు ఆదేశించబడింది?

అమరవీరుల సమాధి జీవితం గురించి దైవగ్రంథం, దైవప్రవక్త సున్నతు భావన ఎంత స్పష్టంగా దాపరికం లేకుండా ఉందంటే కాస్తోకూస్తో చదువుకున్న సామాన్యముస్లింలు కూడా దేవుడు, దైవప్రవక్త ప్రవచనాలను బట్టి అమరవీరుల, ఔలియాల, సదాచారుల ఆత్మలు సమాధుల్లో లేవనీ, అవి స్వర్గంలోనో లేక ఇల్లియ్యీన్‌లోనో ఉన్నాయనీ, ఇక అవి స్వర్గం లేక ఇల్లియ్యీన్ నుంచి తిరిగి ప్రపంచంలోకి రావటంగానీ, మొరలు ఆలకించటం గాని, ప్రజల అవసరాలు తీర్చటం గాని, మురాఖబా, ముకాషఫా చేసేవారిని కలవటం గాని,ఎవరితోనయినా మట్లాడటం గాని జరగదని అర్థం చేసుకోగలరు. కేవలం ప్రాపంచిక ప్రయోజనాలు, ప్రాపంచిక సిరిసంపదలు పదవీహోదాలు లభిస్తాయనే దృష్టితో దైవ సన్నిధిలో జవాబు చెప్పుకోవలసి ఉంటుందన్న విషయాన్ని పూర్తిగా విస్మరించినవారు మాత్రమే ఇలాంటి నిరాధారమైన, భ్రష్టకరమైన తప్పుడు ఎద్దేవాలు చేయటానికి సాహసించగలరు.

https://teluguislam.net



# దైవ ప్రవక్తగారి సమాధి జీవితం

దైవప్రవక్త (సల్లం) గారి సమాధి జీవితం విషయమై రెండు అభిప్రాయ వర్గాలవారున్నారు. ఒక వర్గం దృష్టిలో దైవప్రవక్త (సల్లం) ఇప్పటికీ ఈ ప్రపంచంలో ఉన్నట్లే సజీవంగా ఉన్నారు. లేదు, ఇతర మానవులకు మరణం సంభవించినట్లు దైవప్రవక్తకు కూడా మరణం సంభవించింది, కనుక ఆయన ఇప్పుడు బతికిలేరు, చనిపోయారు అని రెండోవర్గం అభిప్రాయం.

మొదటి వర్గం వారి విశ్వాసాలకు సంబంధించి కొన్ని కొసమెరుపులు గమనించండి:

1) దైవ ప్రవక్తల (సమాధి) జీవితం వాస్తవమైనది. అనుభవపూర్వకమైనది. ప్రాపంచికమైనది. దైవ నిర్ణయం రుజువు కావటం కోసం కేవలం ఒకే ఒక క్షణానికి వారికి చావు వస్తుంది. ఆ తర్వాత వెంటనే మునుపటిలాగే జీవితం ప్రసాదించ బడుతుంది.[1]

2) దైవప్రవక్తగారి జీవన్మరణాలలో ఎలాంటి తేడా లేదు. ఆయన తన అనుచర సమాజాన్ని చూస్తున్నారు. వారి పరిస్థితులు, ఉద్దేశ్యాలు, ఆలోచనలు, మనసులోని మాటలు ఆయనకు తెలుస్తూనే ఉంటాయి.[2]

3) దైవప్రవక్తల పవిత్ర సమాధుల్లోకి వారి భార్యామణులు తీసుకురాబడతారు. దైవప్రవక్తలు అక్కడ వాళ్ళతో రాత్రిగడుపుతారు.[3]

4) ఇమాము మరియు ఖుత్బ్ అయిన సయ్యిదినా అహ్మద్ రిఫాయీ (రజి) గారు దైవప్రవక్త (సల్లం)గారి పవిత్ర సమాధి ముందు నిలబడి "తమరి శుభకరాన్ని నా అధరాలతో ముద్దుపెట్టుకోనివ్వండి" అని అడిగారు. అప్పుడు సమాధిలో నుంచి ఆయన శుభకరం బయటికి వచ్చింది. ఇమామ్ రిఫాయీ దాన్ని చుంబించారు. 4

5) (సాయంత్రం) ఆరున్నర గంటల సమయం. దైవప్రక్త దర్బారు అలంకరించబడి ఉంది. నేను దైవప్రవక్త దర్బారుకు హాజరై పాతికేళ్ళయింది. అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) మరియు ఉమర్ ఫారూఖ్(రజి)లు గొప్ప భక్తిశ్రద్ధలతో కూర్చొని ఉన్నట్లు కనిపించారు. వారందరూ ప్రత్యేక ఏర్పాట్లతో హజ్రత్‌జీ మౌలానా అల్లాహ్‌యార్‌ఖాన్‌ను గుమిగూడి ఉన్నారు. నేను ఒంటరిగా అక్కడికి వెళ్ళాను. హజ్రత్‌గారు బ్రహ్మాండమైన వింతైన దుస్తులు ధరించి ఉన్నారు. తలమీద

---

1) మల్‌ఫూజాత్ అజ్ అహ్మద్ రజాఖాన్ బరేల్వి. మూడోభాగం, 276వ పుట.
2) ఖాలిసుల్ ఏతిఖాద్, 39వ పుట.
3) మల్‌ఫూజాత్ అజ్ అహ్మద్ రజాఖాన్ బరేల్వి మూడోభాగం 276 వ పుట.
4) మజ్‌మూఅ రసాయెల్ అజ్ అహ్మద్ రజాఖాన్ బరేల్వి మొదటి సంపుటి 173వ పుట.

https://teluguislam.net


కిరీటం ధగధగ మెరుస్తోంది. ఏదో ప్రత్యేకమైన సమావేశం జరుగుతూ ఉంది.కారుణ్య ప్రవక్త చిరునవ్వుల కరుణారసాలు కురిపిస్తున్నారు. ఆ గౌరవమూర్తిని అలాంటి విచిత్ర స్థితిలో చూసి బహుశా హజ్రత్‌జీగారికి ఏదో గొప్ప పదవి లభించబోతుందేమో అనుకున్నాను నేను. ఈ స్థితి ఆరున్నర నుంచి పావు తక్కువ ఎనిమిది గంటల వరకు కొనసాగింది. [1]

6) దైవప్రవక్తతో నా ఆంతరంగిక ప్రమాణం (బైత్) ఎలాంటి మధ్యవర్తిత్వం లేకుండా నేరుగా ఎలా జరిగిందంటే -నాకు దైవప్రవక్త (సల్లం) ఒక ఎత్తయిన చోట ఆసీనులై ఉన్నట్లు, సయ్యిద్ అహ్మద్ షహీద్‌గారి చెయ్యి ఆయన చేతిలో ఉన్నట్లు, నేను కూడా అక్కడే ఎంతో వినయంగా దూరంలో నించొని ఉన్నట్లు సయ్యిద్ గారు నా చెయ్యి పట్టుకొని దైవప్రవక్త చేతిలో పెట్టినట్లు కనిపించింది. [2]

7) హజ్రత్‌జీ (అంటే మౌలానా అల్లాహ్ యార్‌ఖాన్) దైవప్రవక్త (సల్లం) తనను గడ్డం గొరిగించుకున్న వారెవర్నీ (తన సన్నిధికి) వెంట తీసుకురావద్దని వారించారని బహిరంగ సభలోనే చెప్పేవారు. నిజానికి హజ్రత్‌జీగారు ఉద్దేశ్యపూర్వకంగా అలాచేసేవారు కాదు. కాని తనకు ఆ విధంగా ఆదేశం అయినప్పటి నుంచి ఆయన దైవప్రవక్త దర్బారుకు హాజరయినప్పుడల్లా తనవెంట గడ్డం గీసుకున్న వారెవరైనా వస్తున్నారేమోనని జాగ్రత్త పడేవారు. ఇప్పటికీ జాగ్రత్తపడుతున్నారు. [3]

'దైవప్రవక్త బతికే ఉన్నారు' అని నమ్మే వారి వాదనలకు సంబంధించిన ఉదాహరణలు కొన్ని మేము పైన పేర్కొన్నాము. ఇప్పుడు దైవ గ్రంథం, దైవప్రవక్త సున్నతు దృష్టిలో ఈ విధమైన నమ్మకాలు సరైనవో కావో సమీక్షిద్దాం.

దైవప్రవక్త మరణం గురించి దైవగ్రంథం, స్వయంగా దైవప్రవక్త ప్రవచించిన వాస్తవాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

1) జుమర్ సూరాలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ﴿إِنَّكَ مَيِّتٌ وَإِنَّهُم مَّيِّتُونَ﴾ ఓ ముహమ్మద్! నిస్సందేహంగా నీవూ మరణిస్తావు. వారూ మరణిస్తారు. (30వ సూక్తి) ఈ సూక్తిలో అల్లాహ్ దైవప్రవక్త మరణం కోసం, సామాన్య మానవుల కోసం ఉపయోగించిన పదమే వాడాడు. అంటే ఇతరులకు మరణం ఎలా సంభవిస్తుందో దైవప్రవక్తకు కూడా అలాగే సంభవించిందని భావం.

2) అంబియా సూరాలో అల్లాహ్ ఇలా అడుగుతున్నాడు:

﴿وَمَا جَعَلْنَا لِبَشَرٍ مِّن قَبْلِكَ الْخُلْدَ أَفَإِن مِّتَّ فَهُمُ الْخَالِدُونَ﴾

---

1) ఇర్షాదుస్సాలికీన్ మొదటి భాగం అజ్ హజ్రత్ మౌలానా ముహమ్మద్ అక్రమ్ 19వ పుట.
2) షమాయిమె ఇమ్‌దాదియా అజ్ హాజీ ఇమ్‌దాదుల్లాహ్ 108వ పుట.
3) ఇర్షాదుస్సాలికీన్ మొదటి భాగం 80వ పుట.

https://teluguislam.net



ఓ ప్రవక్తా! శాశ్వత జీవితాన్ని మేము నీకు పూర్వం కూడా ఏ మానవునికీ ప్రసాదించలేదు. ఒకవేళ నీవు మరణిస్తే వారు మాత్రం శాశ్వతంగా జీవించి ఉంటారా! (34వ సూక్తి)

ఈ సూక్తిలో అల్లాహ్ రెండు విషయాలు వివరించాడు. అవి ఒకటి: అంతిమప్రవక్తకు ముందు గతించిన దైవప్రవక్తలకు కూడా మరణం సంభవించింది. రెండోది నీకు కూడా మరణం సంభవిస్తుంది. శాశ్వత జీవితం నీకు పూర్వం ఏ ప్రవక్తకూ ఇవ్వలేదు. నీక్కూడా ఇవ్వబోము.

3) ఉహుద్ యుద్ధంలో దైవప్రవక్త (సల్లం) అమరగతులయ్యారనే వదంతి వ్యాపించగానే ఆయన అనుచరులు యుద్ధభూమిలో నిరాశానిస్పృహలకు లోనై యుద్ధం చేయకుండా కూర్చున్నారు. అప్పుడు అల్లాహ్ ఈ సూక్తిని అవతరింపజేశాడు: ﴿أَفَإِنْ مَاتَ أَوْ قُتِلَ انْقَلَبْتُمْ عَلَىٰ أَعْقَابِكُمْ﴾

ఒకవేళ ముహమ్మద్ (సహజంగా) మరణిస్తే లేక హత్యచేయబడితే. మీరు వెనుకంజవేసి మరలిపోతారా? (అలి ఇమ్రాన్ సూరా, 144వ సూక్తి)

ఒకవేళ దైవప్రవక్తకు కొన్ని క్షణాల మరణం తర్వాత మళ్లీ ప్రాపంచిక జీవితం లభించబోవటం నిజమైనట్లయితే దైవసూక్తి పైవిధంగా కాకుండా "ప్రజలారా! చింతించకండి. చనిపోయినా, హత్యచేయబడినా దైవప్రవక్త మీవెంటే ఉంటారు. కనుక మీరు నిరాశ చెందవలసిన అవసరం లేదు" అని ఉండాల్సింది. కాని అలా లేదు.

4) అలి ఇమ్రాన్ సూరాలోని సూక్తిలో అల్లాహ్ గత ప్రవక్తలను ప్రస్తావించి వారికి కూడా మరణం వచ్చింది అలాగే నీకు కూడా వస్తుంది అని చెప్పాడు. గత ప్రవక్తల్లో ఇద్దరి మరణ సంఘటన స్వయంగా ఖుర్‌ఆన్‌లోనూ వివరించబడింది. దాని ద్వారా దైవప్రవక్తలు మరణించటం నిజమని స్పష్టంగా బోధపడుతోంది. సబా సూరాలో సులైమాన్ ప్రవక్త గురించి... కర్ర ఊతం మీద నిలబడి ఉన్నప్పుడే ఆయనకు మరణం సంభవించిందనీ, కాని తమకు అగోచర జ్ఞానం ఉందని గొప్పలు చెప్పుకునే జిన్నాతులకు (లేక వారికి అగోచర జ్ఞానం ఉందని ప్రజలు భావించిన జిన్నాతులకు) సులైమాన్ ప్రవక్త మరణించారన్న సంగతి చాలా కాలం తర్వాత గాని తెలిసి రాలేదని అల్లాహ్ తెలియజేశాడు.

﴿فَلَمَّا قَضَيْنَا عَلَيْهِ الْمَوْتَ مَا دَلَّهُمْ عَلَىٰ مَوْتِهِ إِلَّا دَابَّةُ الْأَرْضِ تَأْكُلُ مِنْسَأَتَهُ فَلَمَّا خَرَّ تَبَيَّنَتِ الْجِنُّ أَنْ لَوْ كَانُوا يَعْلَمُونَ الْغَيْبَ مَا لَبِثُوا فِي الْعَذَابِ الْمُهِينِ﴾

"ఆ తరువాత సులైమాన్‌పై మేము మరణ నిర్ణయాన్ని అమలు జరిపినప్పుడు జిన్నాతులకు అతని మరణం గురించి తెలియజేసిన వస్తువు అతని చేతి కర్రను

https://teluguislam.net



తింటూ ఉన్న చీడపురుగే తప్ప మరొకటికాదు. ఈ విధంగా సులైమాన్ పడిపోగా, తమకు అగోచర విషయాలు తెలిసి ఉంటే అవమానకరమైన ఈ బాధకు గురి అయి ఉండేవారము కాము అని జిన్నాతులకు స్పష్టంగా తెలిసిపోయింది.

(సబాసూరా, 14వ సూక్తి).

సులైమాన్ ప్రవక్త మరణించిన తర్వాత ఆయన చేతికర్రను చెదలు తినటానికి ఒక్క సంవత్సరకాలం పట్టిందని కొందరు పండితులు అభిప్రాయపడ్డారు. దాన్ని మనం అరునెలలు అనుకున్నా దైవప్రవక్తలకు క్షణికకాలం చావు వస్తుంది ఆ తర్వాత వెంటనే మళ్లీ ప్రాపంచిక జీవితం లభిస్తుంది అన్న భావన తప్పు అని రుజువు చేయటానికి అది చాలు. సులైమాన్ ప్రవక్త తన మరణానంతరం ఎంతకాలమైతే నించున్నారో అంతకాలం తన చేతికర్ర ఆధారంగానే నించున్నారని దైవసూక్తి ద్వారా బోధపడుతుంది. ఆయన గనక బతికుంటే ఆయనకు చేతి కర్ర ఆధారం ఎందుకు అవసరమయింది? కర్రకు చెదలు పట్టి కర్ర విరిగిపోగానే సులైమాన్ ప్రవక్త కిందపడి పోయారు. ఆయన బతికుంటే క్రింద ఎందుకు పడిపోయేవారు?

బఖరా సూరాలో అల్లాహ్ యాఖూబ్ ప్రవక్త గురించి ఇలా వివరించాడు: యాఖూబ్‌కు మరణం సమీపించినప్పుడు ఆయన తన కుమారులను పిలిచి నా తదనంతరం మీరు ఎవరిని పూజిస్తారు?" అని అడిగారు. దానికి ఆయన కుమారులు

نَعْبُدُ اِلٰهَكَ وَاِلٰهَ اٰبَآءِكَ اِبْرٰهِيْمَ وَاِسْمٰعِيْلَ وَاِسْحٰقَ اِلٰهًا وَّاحِدًا

"మీ ఆరాధ్యుడు, మీ పూర్వీకులయిన ఇబ్రాహీమ్, ఇస్‌హాఖ్‌ల ఏకైకారాధ్యుడైన దేవుణ్ణే ఆరాధిస్తాము" అని సమాధానమిచ్చారు (బఖరా సూరా, 133వ సూక్తి) దైవప్రవక్తలు క్షణిక కాలంపాటు మరణించి మళ్లీ ప్రాపంచిక జీవితంలాగా జీవించబడతారన్న మాటే నిజమయితే యాఖూబ్ ప్రవక్త తన తదనంతరం తన పిల్లల పరిస్థితి గురించి ఎందుకు చింతించారు. 'నా తర్వాత మీరు ఎవరిని ఆరాధిస్తారు' అని వారిని అడగవలసిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒకవేళ దైవప్రవక్తలు మరణానంతరం కూడా జీవించి ఉంటారన్నమాటే నిజమయితే తండ్రి అడిగిన ప్రశ్నకు యాఖూబ్ కుమారులు ఈ విధంగా సమాధానం చెప్పాల్సింది. 'నాన్నా మీరు మళ్ళీ ప్రాపంచిక జీవితంలోకి తిరిగి వచ్చే వారే. అప్పుడు మేము ఎవరిని ఆరాధిస్తామో మీరెలాగూ చూస్తారు కదా! మీకు మా గురించి చింత దేనికి?' దీని ద్వారా బోధపడేదేమిటంటే దైవప్రవక్తలు మరణించిన తర్వాత మళ్లీ ప్రాపంచిక జీవితంలా బతికించబడతారనే నమ్మకం ఆ తండ్రికి లేదు, కొడుకులకూ లేదు. పైగా వారు అంతకు ముందు ప్రవక్తలు కూడా మరణించారనీ, వారిలో ఎవరూ ఈ లోకానికి తిరిగి రాలేరన్న విషయాన్నే నమ్మేవారు.

https://teluguislam.net



5) హజ్రత్ జుబైర్ బిన్ ముత్యిమ్ (రజి) కథనం: ఒక మహిళ దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి ఏదో మాట్లాడింది. ఆయన ఆమెను మళ్లీ ఇంకెప్పుడయినా రమ్మని ఆదేశించారు. అందుకామె "దైవప్రవక్తా! నేనొచ్చినప్పటికి మీరు లేకపోతే ఏం చెయ్యాలి"? అని అడిగింది. అంటే దైవప్రవక్త మరణించిఉంటే ఏం చెయ్యాలి అన్నది ఆమె ఉద్దేశ్యం. దానికి దైవప్రవక్త "ఒకవేళ నేను దొరక్కపోతే అబూబక్ర్‌తో మాట్లాడుకో" అని చెప్పారు (బుఖారీ-ముస్లిం).

పై హదీసు ద్వారా ఈ క్రింది రెండు విషయాలు స్పష్టంగా బోధపడుతున్నాయి.

1) దైవప్రవక్త కాలంలో ఆయన అనుచరులు, అనుచరిణులు ఆయన మరణానంతరం తాము ఆయనతో మాట్లాడలేమని, ఆయన మాటలు వినలేమని, ఆయన తమకు మార్గదర్శకత్వం వహించలేరని, సహాయం కూడా చేయలేరని నమ్మేవారు.

2) దైవప్రవక్తలు మరణించరనీ, కనుక తను మరణిస్తే తన సమాధి దగ్గరికి వచ్చి మాట్లాడుకోమని లేక మరణం తర్వాత కూడా తను ప్రాపంచిక జీవితం లాగా బతికుంటాననీ, నేను మీ మాటలు వింటానని దైవప్రవక్త (సల్లం) కూడా ఎన్నడూ బోధించలేదు. పైగా తను మరణిస్తే అబూబక్ర్‌తో మాట్లాడుకోమని చెప్పారు.

6) దైవప్రవక్త మరణ సమయంలో కూడా ఆయన అనుచరుల మధ్య అసలు దైవప్రవక్తకు మరణం సంభవించిందా లేదా అన్న చర్చ మొదలయింది. ఆ సందర్భంలో ఉమర్ (రజి) లాంటి దైవగ్రంథ, దైవప్రవక్త ప్రవచన పండితుడు, దూరదృష్టి ధర్మావగాహన కల సహాబీ కూడా "దైవసాక్షి! దైవప్రవక్త చనిపోలేదు. ఆయన కపటులను అంతం చేసేదాకా చనిపోరు" అన్న భ్రమకు లోనయ్యారు (ఇబ్నెమాజా). అప్పుడు అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) ఓ బ్రహ్మాండమైన, చారిత్రాత్మక ఉపన్యాసమిచ్చి దైవప్రవక్త జీవిత సమస్య ఇక ప్రళయం వరకూ తలెత్తకుండా పరిష్కరించారు. అప్పుడు ఆయన అన్న మాటలివి:

مَنْ كَانَ يَعْبُدُ اللّٰهَ فَإِنَّ اللّٰهَ حَيٌّ لَا يَمُوْتُ وَمَنْ كَانَ يَعْبُدُ مُحَمَّدًا فَإِنَّ مُحَمَّدًا قَدْ مَاتَ

అంటే ఎవరయితే అల్లాహ్‌ను ఆరాధించేవాడో వారికి అల్లాహ్ సజీవుడనీ, ఆయనకు మృత్యువు లేదని తెలియాలి, మరెవరయితే ముహమ్మద్‌ని ఆరాధించే వారో వారు ముహమ్మద్ మరణించారని తెలుసుకోవాలి, (ఇబ్నెమాజా). అబూబక్ర్ (రజి)గారు చేసిన ఉపన్యాసం విన్న తర్వాత ఉమర్ (రజి) ఇలా అన్నారు: "దైవంసాక్షి! అబూబక్ర్ ఉపన్యాసం విన్నప్పుడు నాకు నా నడుం విరిగిపోయినట్లనిపించింది. నా కాళ్లు లేవలేదు. నేను నేలమీద దొర్లిపోయాను. ఎందుకంటే దైవప్రవక్త మరణించారని అప్పుడు నాకు నమ్మకం కలిగింది. (బుఖారీ).

https://teluguislam.net



7) దైవప్రవక్త మరణం ఆయన ఇంటివారిని, ఆయన అనుచరుల్ని శోకసముద్రంలో ముంచెత్తింది. ఫాతిమా (రజి. అన్హా) బాధాతప్త గొంతుతో అనస్ (రజి)ని ఉద్దేశించి "అనస్! దైవప్రవక్తమీద మన్నుపోయటానికి మీకు చేతులెలా వచ్చాయి?" అని అడిగారు. సాబిత్ (రజి) దైవప్రవక్త (సల్లం) మరణించినప్పుడు ఫాతిమా (రజి. అన్హా) పడ్డ బాధను వివరించినప్పుడల్లా తను స్వయంగా కన్నీరు మున్నీరుగా విలపించేవారు. "దైవప్రవక్త మరణంతో మదీనాలోని ప్రతి వస్తువుపై చీకటి ఆవరించింది. ఆయన ఖననంతోటే మాకు మా హృదయాల్లోని ప్రవక్తృత్వపు జ్యోతి ఆరిపోతున్నట్లు అనిపించింది" అని అనస్ (రజి) చెప్పారు. దైవప్రవక్త మరణం క్షణికమైనదయితే ఆయన ఇంటివారికి, అబూబక్ర్ ఉమర్ (రజి)లకు, ఇతర అనుచరులందరికి ప్రపంచం చీకటిమయంగా ఎందుకు అనిపించింది అన్నది ప్రశ్న. ఇనుప కండల మనిషి అయిన ఉమర్‌కు నడుం విరిగినట్లు ఎందుకు అనిపించింది?

ఇప్పటి వరకు పేర్కొనబడిన ఖుర్ఆన్ హదీసు ఆధారాలను అటు ఉంచి ఇప్పుడు మరో కొత్త కోణంలో ఈ సమస్యను సమీక్షిద్దాం.

దైవప్రవక్త (సల్లం) మరణానంతరం బనూసాయిదా సఖీఫాలో ఖిలాఫత్ గురించి గొడవ జరుగుతూ ఉంది. సిద్దీఖీ హయాంలో ప్రజలు జకాత్ ఇవ్వము అని ధిక్కరించటం, ధర్మభ్రష్టులైపోవటం లాంటి ఉపద్రవాలు తలెత్తాయి. ఉస్మాన్ (రజి) అన్యాయంగా అమర గతులయ్యారు. అనుచరుల మధ్య జమల్ యుద్ధం, సిఫ్ఫీన్ యుద్ధం లాంటి ఘోర రక్తపాతాన్ని సృష్టించిన యుద్ధాలు జరిగాయి. కర్బలా (యుద్ధ) భూమిలో ఆయనగారి ప్రియ మనవడు అత్యంత నిర్దాక్షిణ్యంగా చంపబడ్డాడు. ఈ రోజు కూడా ప్రపంచంలో వివిధ చోట్ల ముస్లిం సమాజంపై ఎలాంటి ప్రళయాలు విరుచుకుపడుతున్నాయి? మరి అదేం జీవితమండీ? దైవప్రవక్త (సల్లం) ఖిలాఫత్ సమస్యలో అనుచరులకు మార్గదర్శకత్వం వహించలేదు. జకాత్ ఇవ్వకపోవటం, ధర్మభ్రష్టులైపోవటం లాంటి ఉపద్రవాలు తలెత్తినప్పుడు ఆయన అబూబక్ర్‌కు ఎలాంటి సూచనలూ ఇవ్వలేదు. తను ఎంతో గర్వంగా చెప్పుకునే తన అల్లుడు విశ్వాసుల నాయకుడైన ఉస్మాన్‌కు ఎలాంటి సహాయం చేయలేదు. జమల్ యుద్ధం, సిఫ్ఫీన్ యుద్ధాలను ఆపలేదు. కర్బలాలో తన ప్రియమనవణ్ణి కాపాడలేదు. ఈ రోజు కూడా ముస్లిం సమాజం ప్రపంచంలో ఎన్నోచోట్ల అవిశ్వాసుల అన్యాయాలకు, దౌర్జన్యాలకు గురై ఉన్నారు.కాని ఇవన్నీ తెలిసి కూడా దైవప్రవక్త (సల్లం) మౌనం వహిస్తున్నారు. తన అనుచర సమాజానికి సరైన సూచనలు ఇవ్వటం గాని సహాయంగాని చేయట్లేదు. దౌర్జన్యం చేసేవారిని ఆపట్లేదు. వారికి వ్యతిరేకంగా ఏ ఆజ్ఞ జారీచేయట్లేదు. మరోవైపేమో ఔలియాలు, సూఫీలతో పాటు ఆయన

https://teluguislam.net



సమావేశాలు నిర్వహిస్తున్నారు? వారికి పదవులు పందేరాలు ప్రసాదిస్తున్నారు? యావత్తు ప్రపంచంలో జరిగే దరూద్‌సలామ్‌ల సమావేశాల్లో పాల్గొంటున్నారు?

మేము పూర్తి చిత్తశుద్ధితో, సానుభూతితో దైవప్రవక్త (మనలాగే) జీవించి ఉన్నారని చెప్పేవారిని అడుగుతున్నాం. దయచేసి కాస్త ఆలోచించండి. దైవప్రవక్త సున్నతు ద్వారా బోధపడేదేమిటంటే-ఆయన సమాధి జీవితం ఇతర దైవప్రవక్తలు, అమరవీరులు, ఔలియాలందరికంటే గొప్పది, ఉన్నతమైనది, పరిపూర్ణమైనది. అది ఇహలోక జీవితంలా లేదు పరలోక జీవితంలా కూడా లేదు. దాని అసలు స్థితి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. ఆయన పవిత్ర భౌతికకాయం మదీనాలోని ఆయన సమాధిలో నేటికి పధ్నాలుగు వందల సంవత్సరాల క్రితం ఖననం చేసినప్పుడు ఎంత తాజాగా ఉందో ఇప్పటికీ అలాగే ఉంది. ప్రళయం వరకూ అలాగే తాజాగా, ఎలాంటి మచ్చల్లేకుండా ఉంటుంది. ఆయన ఆత్మ జన్నతుల్ ఫిర్‌దౌస్ లోని అత్యున్నత స్థానం మీద దైవసింహాసనానికి సమీపంలో ఉంది. అల్లాహ్ ఆయనను తాను ఏది కోరితే అది తినిపిస్తాడు. త్రాపిస్తాడు. వల్లాహు అలము బిస్సవాబ్!

## ఒక అపోహ:

దైవప్రవక్త సమాధి జీవితం ప్రాపంచిక జీవితం లాంటిదని రుజువు చేయటానికి కొందరు ఈ క్రింది హదీసులు నిదర్శనంగా చూపిస్తారు.

1) ఎవరైనా నాకు సలాం చేస్తే అల్లాహ్ నా ఆత్మను (తిరిగి శరీరంలోకి) పంపుతాడు. దాంతో నేను అతనికి ప్రతి సలాం చేస్తాను. (అబూదావూద్)

2) నా కొరకు అతి ఎక్కువగా దరూద్ పఠించండి. అల్లాహ్ నా సమాధి దగ్గర ఒక దూతను నియమిస్తాడు. నా అనుచర సమాజంలో ఎవరైనా నా కొరకు దరూద్ పఠిస్తే అప్పుడు ఆ దూత నాతో "ముహమ్మద్! ఫలానా అతని కుమారుడు ఫలానా మనిషి, ఫలానా సమయంలో మీ కొరకు దరూద్ పఠించాడు" అని చెబుతాడు. (దైలమీ).

3) జుమారోజు అత్యధికంగా నా కొరకు దరూద్ పఠించండి. జుమారోజు నా కొరకు పఠించబడిన దరూద్ నా ముందు సమర్పించబడుతుంది. (హాకిమ్, బైహఖీ)

షైఖ్ ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్‌బానీ (రహ్మాలై) మొదటి రెండు హదీసులను హసన్‌గానూ, మూడో హదీసును సహీహ్‌గానూ పేర్కొన్నారు. ఈ హదీసుల ద్వారా "దైవప్రవక్త జీవితం"ను రుజువు చేయాలని ప్రయత్నించేవారు కూడా మేము ఇంతకు ముందు "సమాధి జీవితం ఎలా ఉంటుంది?" అనే శీర్షిక క్రింద ప్రస్తావించిన అపోహకే లోనై ఉన్నారు. దైవప్రవక్త (సల్లం) సమాధిలో ఇతర దైవప్రవక్తలు, వలీలు, అమరగతులకంటే ఉన్నతమైన, పరిపూర్ణమైన జీవితం గడుపుతున్న మాట నిజమే. దాన్ని నిరాకరించటానికి వీలులేదు. కాని సమాధి జీవితం ఇహలోక జీవితానికి పూర్తిగా భిన్నమైనది కనుక దాన్ని ఈ ప్రాపంచిక జీవితంతో పోల్చటం శుద్ధ తప్పు. మనిషికి ఈ ప్రపంచంలో ఉండి సమాధిలోక జీవిత వ్యవహారాలను అర్థం చేసుకునే తెలివి, అవగాహన ఇవ్వబడలేదు. (బఖర సూరా 154వ సూక్తి చూడండి).

https://teluguislam.net


మీరే ఆలోచించండి! ప్రజల సలాముకు జవాబు చెప్పటం కోసం ఆయన ఆత్మను అయన పవిత్ర దేహంలోకి పంపించటం అనేక విధాలుగా జరగవచ్చు. ఉదా: ప్రతి వ్యక్తి సలాం చేసినప్పుడల్లా ఆయన ఆత్మను దేహంలోకి పంపించవచ్చు, లేక రోజుకి ఒకసారి ఏదైనా సమయంలో పంపించవచ్చు లేక వారానికి ఒకసారి లేదా నెలకు ఒకసారి లేక సంవత్సరంలో ఒకసారి ప్రజలందరి సలాములు కలిపి ఆయనకు చేరవేస్తే ఆయన వాటన్నిటికి ఒకేసారి ప్రతి సలామ్ చెప్పవచ్చు. ఆత్మ శరీరంలోకి పంపించటం పైన పేర్కొనబడిన విధాల్లో ఏదో ఒక విధంగా జరగవచ్చు లేక మరేదయినా కొత్తవిధంగా జరగవచ్చు. దాని వాస్తవస్థితి అల్లాహ్‌కు మాత్రమే తెలుసు. దరూదె షరీఫ్ సంగతి కూడా అంతే. అవి దైవప్రవక్తకు రోజూ చేరవేయబడతాయా లేక ఆయన ప్రవచించినట్లు జుమారోజు చేరవేయబడతాయా? నిజం చెప్పాలంటే అల్లాహ్‌కు తప్ప మరెవరికీ తెలియని విషయాలివి. మనం వాటిని విశ్వసించటం విధి. కాని వాటి స్థితిని అర్థం చేసుకోవటం మనకు అసాధ్యం. అసలు మనకు దాని అవసరం కూడా లేదు. ఒక విషయాన్ని విశ్వసించటం దాని స్థితిని అర్థం చేసుకోవటంతో ముడిపడిలేదు. ఎన్నో విషయాలమీద మనకు విశ్వాసం ఉంది. కాని ఇహలోక జీవితంలో మనం వాటి స్థితిని అర్థం చేసుకోలేం. ఉదా: రాత్రి చివరి భాగంలో అల్లాహ్ మొదటి ఆకాశంపైకి అవతరిస్తాడని మనకు నమ్మకం ఉంది కాని అది ఎలా జరుగుతుందో మనకు తెలియదు. కిరామన్ కాతిబీన్ దూతలు కర్మల చిట్టాను తయారుచేస్తారని నమ్ముతాం. కాని అది ఎలా జరుగుతుందో మనకు తెలియదు. ప్రళయదినాన కర్మలు తూయబడతాయన్న విషయాన్ని మనం నమ్ముతాం. కాని అది ఎలా జరుగుతుందో తెలీదు. దైవప్రవక్త మేరాజ్ (గగనయానం) చేశారని నమ్ముతాం. కాని అది ఎలా జరిగిందో మనకు తెలియదు. ఇలాంటి ఉదాహరణలు కొన్ని కాదు వందలకొలది ఇవ్వొచ్చు. వాటిని మనం విశ్వసిస్తాం కాని వాటి స్థితి గురించి మనకు తెలియదు. సమాధి జీవితంలో దైవప్రవక్త ఆత్మ శరీరంలోకి పంపించబడటం, ఆయన ప్రజల సలాముకు ప్రతి సలాం చెప్పటం, దూతలు ఆయనకు దరూద్ చేరవేయటం, జుమారోజు ఆయన ముందు దరూద్‌లు సమర్పించబడటం. ఇవన్నీ కూడా ఆ కోవకు చెందినవే. అంటే వాటి స్థితిని, వాస్తవికతను అర్థం చేసుకోవటం మనకు అసాధ్యం. కాని వాటిని విశ్వసించటం మాత్రం విధి. కనుక పై హదీసుల ద్వారా దైవప్రవక్త (సల్లం) సమాధిలో బతికున్నారనీ రుజువు కాదు, అలాగే ఆ హదీసులను నిదర్శనంగా చేసుకొని ఆయన మన సలాం వింటారు, దానికి ప్రతిసలాం చెబుతారు, కనుక మన ఇతర విన్నపాలు, వినతులు, మొరలు దుఆలు కూడా వింటారు, దానికి సమాధానం పలుకుతారు, మన అవసరాలు తీరుస్తారు, మన మన్నింపు కోసం ప్రార్థిస్తారు లేక సమాధి నుంచి బయటికి విచ్చేసి ఔలియాలతో సమావేశాలు ఏర్పాటు చేస్తారని చెప్పటమూ సరికాదు. ఇవన్నీ తప్పుడు ఊహాగానాలు. జనాన్ని భ్రష్టుపట్టించేవి. గ్రంథం, సున్నతుల బోధనలతో

https://teluguislam.net



వీటికి ఏ మాత్రం సంబంధం లేదు. దేవుడు ఆయన ప్రవక్త ఎంతవరకయితే చెప్పారో అంతవరకు నిస్సంకోచంగా చెప్పాలి. దాన్ని విశ్వసించాలి. ఏ విషయమైతే దేవుడు, దైవప్రవక్త చెప్పలేదో దాన్ని స్వంతంగా ఊహించుకొని ఆ తర్వాత అది దేవుని, దైవప్రవక్త మాట అని చెప్పకుండా ఉండేందుకు వెయ్యిసార్లు శరణువేడుకోవాలి. దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"مَنْ كَذَبَ عَلَىَّ مُتَعَمِّدًا فَلْيَتَبَوَّأْ مَقْعَدَهُ مِنَ النَّارِ"

ఎవరయితే ఉద్దేశపూర్వకంగా నామీద అబద్ధాన్ని మోపుతాడో అతను తన నివాసాన్ని నరకంలో ఏర్పరచుకుంటాడు. (బుఖారీ-ముస్లిం)

## సమాధిలో శిక్ష ఆత్మకా లేక శరీరానికా?

సమాధిలో లభించే శిక్షాబహుమానాల గురించి చదివినప్పుడు "సమాధిలో శిక్ష లేక బహుమానాలు లభించేది ఆత్మకా లేక శరీరానికా లేక రెండిటికా? "అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది.

పండితులు ఈ విషయంపైన సుదీర్ఘమైన చర్చలు జరిపారు. కొందరు శరీరాన్ని కొంతకాలం తర్వాత మట్టి తినేస్తుంది. మరేమో బహుమానం లేక శిక్ష అనేది ప్రళయం వరకూ మిగులుంటుంది కనుక ఈ శిక్ష లేక బహుమానం అనేది ఆత్మకే లభిస్తుంది అని అభిప్రాయపడ్డారు. సమాధిలోకంలో శిక్ష లేక బహుమానం అనేది సమాధికి సంబంధించినది. విశ్వాసి కొరకు సమాధి విశాలమవుతుంది. అందులో వెలుతురు ఉంటుంది. అవిశ్వాసిపైకి సర్పాలు సమాధిలోనే వదలబడతాయి. సమాధిగోడలు మాటిమాటికీ శవాన్ని ఒత్తుతూ ఉంటాయి. సమాధిలో కేవలం శరీరం మాత్రమే ఉంటుంది. కనుక శరీరంలోని ఒక్క అణువు మిగిలి ఉన్నా సమాధి శిక్ష లేక బహుమానం దానికే కలుగుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. ఇంకొందరి అభిప్రాయం ప్రకారం ఆత్మ మరియు శరీరం వేర్వేరుగా ఉన్నా వాటి మధ్య అగోచరమైన సంబంధం ఉంటుంది కనుక శిక్షాబహుమానాలు ఆ రెండిటికి కలుగుతాయి.

మా దృష్టిలో ఈ విషయం కూడా అకోవకు చెందినదే. అంటే దీనిని విశ్వసించటం విధి. అయితే దాని స్థితి గురించి మాత్రం మనకు తెలియదు. అల్లాహ్‌కు పూర్తి అధికారం ఉంది. ఆయన తలచుకుంటే కుళ్లి కృశించి మట్టిలో కలిసిపోయిన శరీరానికి లేక ఆత్మకు లేక రెండిటికీ శిక్షాబహుమానాలు ఇవ్వగలడు. మా దృష్టిలో ఇది ఫలితం లేని వృధా చర్చ. అందులో పడి మేము మా సమయాన్ని ,పాఠక మహాశయుల సమయాన్ని వృధా చేయదలచుకోలేదు. ఈ చర్చకు మన సన్మార్గంతో ఏ మాత్రం సంబంధం ఉండి ఉన్నా దైవప్రవక్త (సల్లం) దాన్ని తప్పకుండా వివరించి ఉండేవారు. కనుక మనం దైవప్రవక్త (సల్లం) చెప్పిన మాటతోనే సంతృప్తి చెందాలి. ఆ మాట ఏమిటంటే సమాధి శిక్ష తథ్యం. దాన్నుంచి శరణు వేడుకోండి.

هذا ما عندي و العلم عند الله و هو بكل شيء عليم و صلى الله على نبينا محمد و آله و صحبه اجمعين